RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

## కోట్ల విలువైన ఎనిమి ప్రాపర్టీ షేర్లను అమ్మేశాం

**కేంద్రం**

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు



సుమారు రూ.2079 కోట్ల విలువైన ఎనిమి ప్రాపర్టీని అమ్మినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 1947 నుంచి 1962 మధ్య తమ ఆస్తుల్ని వదలేసి, చైనా, పాకిస్థాన్ పౌరసత్వం తీసుకున్న వారికి చెందిన సంపదను ఎనిమి ప్రాపర్టీగా పిలుస్తారు. దీనిపై కేంద్ర

మిగతా 3లో

RANGAREDDY, EDITION : 01, VOLUME :201 EDITOR: CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 06 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 201 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 06 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

# రేవంత్ అనే నేను..!

■ ముఖ్యమంత్రిగా రేపు ప్రమాణ స్వీకారం ■ ఎల్బీస్టేడియంలో ఉదయం 10.20 గంటలకు

■ అధికారికంగా ప్రకటించిన కేసీ వేణుగోపాల్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాష్ట్ర మూడో ముఖ్యమంత్రిగా టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డిని ఏఐసీసీ నిర్ణయించింది. గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. మంత్రివర్గ విస్తరణ, ప్రమాణ స్వీకారంపై స్పష్టత రావాల్సి ఉన్నది. సీఎంగా రేవంత్ పేరును మంగళవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అధికారికంగా ప్రకటించారు. అనంతరం రేవంత్‌రెడ్డి హుటాహుటిన ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు. హైదరాబాద్‌లో సోమవారం సమావేశమైన సీఎల్పీ సమావేశమై సీఎం నియామకంపై నిర్ణయాన్ని అధిష్టానికి కట్టబెడుతూ తీర్మానం చేసింది. ఆ తీర్మానాన్ని అధిష్టానానికి పంపించారు. మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్‌గాంధీతోపాటు కేసీ వేణుగోపాల్ ఇతర నేతలు సమావేశమై సీఎం పదవికి రేవంత్ పేరును నిర్ణయించారు. ఈవిషయంలో సోనియాగాంధీతోనూ సంప్రదించి తుది నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు

మిగతా 2లో




## ప్రతిపక్ష కూటమి 'ఇండియా' సమావేశం వాయిదా

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ప్రతిపక్ష కూటమి ఇండియా సమావేశం వాయిదా పడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బీహార్ ముఖ్య మంత్రి నితీష్‌కుమార్, సమాజ్ వాదిపార్టీ (ఎస్పి) అధ్యక్షుడు అఖిలేష్‌యాదవ్‌లు ఈ సమావేశాన్ని దాటవేయాలని యోచిస్తున్నారన్న ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే సమావేశం వాయిదాపడినట్లు వార్తలు రావడం గమనార్హం. వారిరువురు ఈ సమావేశానికి తమ ప్రతి నిధులను పంపనున్నట్లు తెలుస్తోంది. బుధవారం జరిగే ఇండియా కూటమి సమావేశానికి వెళ్లే ఆలోచనలో అఖిలేష్ యాదవ్ లేరని ఆ

మిగతా 2లో

## రాష్ట్రంలో విస్తారంగా వాన

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షం
- 517 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు
- కలెక్టర్లతో సీఎస్, విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా టెలీకాన్ఫరెన్స్

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

మిగ్జామ్ తుఫాన్ ఎఫెక్ట్ ఫలితంగా రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి 10 గంటల వరకు 517 ప్రాంతాల్లో వర్షపాతం

మిగతా 2లో




చంద్ర కక్ష్య నుంచి భూకక్ష్యలోకి

## ప్రొపల్షన్ మాడ్యూల్ : ఇస్రో

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

చంద్రయాన్ -3 ప్రొపల్షన్ మాడ్యూల్ కక్ష్యను విజయవంతంగా మార్చామని ఇస్రో మంగళవారం ప్రకటించింది. చంద్రుడి కక్ష్య లో ఉన్న మాడ్యూల్ ను భూకక్ష్యలోకి తీసుకొచ్చే అరుదైన ప్రయోగంలో విజయవంతమయ్యా మని తెలిపింది. ఇందుకు గాను ఒక కక్ష్య పెంపు విన్యాసం, ఒక ట్రాన్స్-ఎర్త్ ఉత్తేజిత ప్రక్రియ వినియోగించినట్లు తెలిపింది. జియోస్టేషనరీ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జిటిఒ) నుండి చివరి చంద్ర ధ్రువ వృత్తాకార

మిగతా 3లో



# నకిలీ మందుల గుట్టురట్టు

- రూ.4.35 కోట్ల విలువైన క్యాన్సర్ నివారణ మందులు స్వాధీనం :కమలాసన్ రెడ్డి

-పరారీలో నకిలీ మందుల తయారీ కంపెనీ యజమాని

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



నకిలీ మందుల తయారీ ముఠా గుట్టు రట్టయింది. రాష్ట్ర చరిత్రలోనే క్యాన్సర్ నివారణకు ఉపయోగించే అతిపెద్ద నకిలీ మందుల తయారీ దారులను హైదరాబాద్ లోని మచ్చ బొల్లారంలో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు గుర్తించి పట్టుకున్నారు. వీరి నుంచి దాదాపు రూ.4.35 కోట్ల విలువైన నకిలీ క్యాన్సర్ నివారణ మందులను స్వాధీన పర్చుకున్నామని డ్రగ్స్ కంట్రోల్ విభాగం డైరెక్టర్ జనరల్ వీ.బీ. కమలాసన్ రెడ్డి వెల్లడించారు. ఆస్టిక హెల్త్ కేర్ అనే కంపెనీ క్యాన్సర్ నివారణ కు ఉపయోగించే మందులకు సంబంధించి నకిలీ మందులను తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందడంతో ఈ నెల 2న డ్రగ్స్ కంట్రోల్ విభాగానికి చెందిన విజిలెన్స్ ప్రత్యేక బృందాలు హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించాయి. ఈ నకిలీ మందుల చలామణికి సంబంధించిన ఇన్వాయిస్‌ల ద్వారా పోస్టల్ శాఖ ద్వారా కంపెనీ చిరునామా కోసం ఆల్వాల్‌లో వెతకగా అది తప్పుడు చిరునామాగా నిర్ధారణ అయింది. అనంతరం, ఐడీఏ చర్లపల్లి, నాచారం, మేడ్చల్‌లోని వివిధ కొరియర్ కార్యాలయాలను తనిఖీ చేసి ఆస్టికా హెల్త్ కేర్ ద్వారా పంపిణీ అయిన వాటిని తనిఖీ చేశారు. డ్రగ్స్ కంట్రోల్ విభాగానికి చెందిన విజిలెన్స్ ప్రత్యేక బృందం కీసరలోని ఆస్టికా హెల్త్ కేర్ సంస్థపై దాడులు నిర్వహించింది. 'ఆస్టికా హెల్త్‌కేర్' ప్రాంగణం నుంచి నకిలీ డ్రగ్ స్టాక్ డెలివరీ చేస్తున్న కొరియర్ బారుని డీసీఏ అధికారులు గుర్తించారు. మచ్చ బొల్లారం వద్ద మూడు షట్టర్లలో ఈ నకిలీ మందులు నిల్వ చేసి ఉన్నాయి. డిసెంబర్ 4న ఈ నకిలీ మందుల తయారీ లొకేషన్ పై దాడి చేసి రూ.4.35 కోట్ల విలువైన 36 రకాల క్యాన్సర్ నివారణ మందులు, ఇతర మందులను స్వాధీనం చేసుకున్నారు. మందుల లేబుల్స్ ఉనికిలో లేని కంపెనీ 'ఆస్ట్రా జెనెరిక్స్ ప్రయివేటులిమిటెడ్' వివరాలను కలిగి ఉన్నాయి. ఇవి 2021జూలైలో వీరి లైసెన్సులు ఇప్పటికే రద్దు చేయబడ్డాయి, కానీ తయారీ స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌పై తేదీ మార్చి-2023

మిగతా 2లో

రాజీనామా యోచనలో

## ఉత్తమ్ కుమార్ రెడ్డి !



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

తెలంగాణకు కాబోయే ముఖ్యమంత్రి ఎవరనే విషయంపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రావడంతో సోమవారం రాత్రే ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేస్తారనే వార్తలు వెలువడ్డాయి. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరిస్తారని ప్రచారం జరిగినా.. పార్టీలో సీనియర్ నేతలు భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి కూడా ఆ పోస్టు కోసం పోటీపడడంతో ముఖ్యమంత్రి ఎంపిక వాయిదా పడింది. కాగా, ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడుతున్న భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం సాయంత్రమే ఢిల్లీకి చేరుకున్నారు. హైకమాండ్ పెద్దలను కలిసి మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎంపీ పదవికి రాజీనామా చేసే యోచనలో ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఆయన రాజీనామా చేయనున్నట్టు సమాచారం. ఈ మధ్యాహ్నం మల్లికార్జున ఖర్గే నివాసంలో తెలంగాణ సీఎం, ఉప ముఖ్యమంత్రి అభ్యర్థుల ఖరారు తర్వాత దీనిపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. లోకసభ స్పీకర్‌ని ఉత్తమ్ కుమార్ రెడ్డి కలవనున్నారు.

## ప్రతిపక్ష కూటమి

# 'ఇండియా' సమావేశం వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ప్రతినిధి రాజేంద్ర చౌదరీ తెలిపారు. దీంతో రేపు ఢిల్లీలో జరగాల్సిన కూటమి సమావేశం వాయిదా పడినట్లు తెలుస్తోంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కూటమి తదుపరి కార్యాచరణపై చర్చిచేందుకు కాంగ్రెస్ పార్టీ సమావేశానికి పిలుపునిచ్చింది. డిసెంబర్ 6వ తేదీన ఢిల్లీలో సమావేశం జరగనున్నట్లు ప్రకటించింది. అయితే ఆ సమావేశం గురించి తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. మిచౌంగ్ ఎఫెక్ట్‌తో తమిళనాడు వ్యాప్తంగా భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. దీంతో తాను సమావేశానికి హాజరుకాలేనని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ప్రకటించారు. సీట్ల ఒప్పందానికి కాంగ్రెస్ అంగీకరించినట్లైతే, మూడు రాష్ట్రాల్లోనూ విజయం సాధించి ఉండేదని మమతా బెనర్జీ, అఖిలేష్‌యాదవ్‌లు స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లో సీట్ల పంపకంలో కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీల మధ్య వాగ్వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే.

## రాష్ట్రంలో

# విస్తారంగా వాన

(మొదటి పేజీ తరువాయి)

నమోదైంది. బుధవారం నాడు రాష్ట్రంలో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలతో పాటు ఈదురుగాలు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు ఆ జిల్లాలకు ఎల్లో హెచ్చరికను జారీ చేశారు.

**అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు**

**అశ్వరావుపేట (భద్రాద్రి కొత్తగూడెం) 18.23 సెంటీమీటర్లు**
**సదాశివునిపాలెం(ఖమ్మం) 12.90 సెంటీమీటర్లు**
**మధిర (ఖమ్మం) 11.83 సెంటీమీటర్లు**
**వేంసూరు(ఖమ్మం) 11.30 సెంటీమీటర్లు**
**నాగుపల్లి(భద్రాద్రి కొత్తగూడెం) 11.05 సెంటీమీటర్లు**
**రావినూతల(ఖమ్మం) 10.83 సెంటీమీటర్లు**
**అంకంపాలెం(భద్రాద్రి కొత్తగూడెం) 10.60 సెంటీమీటర్లు**
**నాగులవంచె(ఖమ్మం) 9.38 సెంటీమీటర్లు**
**మల్కారం(భద్రాద్రి కొత్తగూడెం) 8.88 సెంటీమీటర్లు**

**అప్రమత్తంగా ఉండండి :** కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం

మిగ్జామ్ తుఫాన్ ఎఫెక్ట్‌తో ఎడతెరపిలేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్లంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం ఈ మేరకు సచివాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాతోపాటు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, సూర్యాపేట తదితర జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. వరదప్రభావిత ప్రాంతాల్లో తగు చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించామన్నారు. ఇప్పటికే పూర్తిగా నిండిన చెరువులకు గండ్లు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ, విపత్తుల నిర్వహణ శాఖ, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖ లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించాలని సూచించారు.

# నకిలీ మందుల గుట్టురట్టు

(మొదటి పేజీ తరువాయి)

పేరుతో పేర్కొనడం గమనార్హం. వీటితో వినాశనకర పరిణామాలు. నకిలీ మందులు ప్రజారోగ్యానికి ముప్పు కలిగించడమే కాకుండా రోగికి కాలక్రమేణా, వినాశకరమైన పరిణామాలను సృష్టిస్తుందని కమల హాసన్ రెడ్డి తెలిపారు. ఈ నకిలీ క్యాన్సర్ మందులకు సంబంధించిన రహస్య కార్యకలాపాలను గుర్తించి, స్వాధీనం చేసుకోవడం రాష్ట్రంలోనే అతిపెద్ద ఘటన అని వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఆస్టికా హెల్త్‌కేర్ డైరెక్టర్ కె. సతీష్ రెడ్డి పరారీలో ఉన్నాడనీ, అతన్ని వెతుకుతున్నామని తెలిపారు. ప్రత్యేక బృందంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ పి. రాము నేతృత్వంలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు జి. శ్రీకాంత్, కె. అన్వేష్, ఎం. చంద్రశేఖర్, వి.అజయ్, ఎస్.వినరు సుష్మీ నగరంలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారని ఆయన వెల్లడించారు.

**పట్టుబడిన డ్రగ్స్‌లో కింది కంపెనీల పేర్లు**

**1) ఆస్ట్రా జెనరిక్స్ ప్రయివేటు లిమిటెడ్, తెలంగాణ**
**2) ఆస్టికా హెల్త్‌కేర్ ప్రయివేటు లిమిటెడ్, తెలంగాణ**
**3) మీడియన్ బయోటెక్ ప్రయివేటు లిమిటెడ్, హిమాచల్ ప్రదేశ్**
**4) అలయన్స్ బయోటెక్, హిమాచల్ ప్రదేశ్**
**5) సన్‌వెట్ హెల్త్‌కేర్, హిమాచల్ ప్రదేశ్,**
**6) సాలస్ ఫార్మాస్యూటికల్స్, హిమాచల్ ప్రదేశ్**
**7) డీఎం ఫార్మా ప్రయివేటు లిమిటెడ్, హిమాచల్ ప్రదేశ్**
**8) సేఫ్ పేరెంటరల్స్ ప్రయివేటు లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్**
**9) బ్లెస్ ఫార్మా ఇండియా ప్రయివేటు లిమిటెడ్ , తెలంగాణ**

# రేవంత్ అనే నేను

(మొదటి పేజీ తరువాయి)

చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్ రావ్ థాక్రే, ఏఐసీసీ ప్రత్యేక పరిశీలకులు డీకే శివ కుమార్, రాష్ట్ర సీనియర్ నేతలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క సమక్షంలో కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. డిప్యూటీ సీఎంతోపాటు మంత్రి వర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

తెలంగాణలో కాంగ్రెస్‌ను విజయ తీరాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషించిన రేవంత్ రెడ్డి వైపే కాంగ్రెస్ అధిష్టానం మొగ్గుచూపింది. సీఎల్పీ నేతగా, సీఎంగా ఆయన పేరునే ఖరారు చేసింది. రాష్ట్ర సీనియర్ నేతలు సీఎం పదవి కోసం పట్టుబట్టినా, పార్టీ వీడుతామని పరోక్షంగా ఒత్తిడి తెచ్చినా తనదైన స్టైల్ లో బుజ్జగించింది. దీంతో పార్టీ ఎమ్మెల్యేల ఏకవాక్య తీర్మానంతో ఢిల్లీ వచ్చిన ఏఐసీసీ పరిశీలకుల నివేదికకు అనుగుణంగా సీఎంగా రేవంత్ రెడ్డి పేరును అధిష్టానం ఖరారు చేసింది.

మంగళవారం 10 రాజాజీ మార్గ్ లోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో కీలక భేటీ జరిగింది. దాదాపు గంటన్నరకుపైగా సాగిన ఈ భేటిలో రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్, మాణిక్‌రావు ఠాక్రే పాల్గొన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు ఎవరనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు.

సామాజిక వర్గాలకు కూర్పు, ఎవరెవరికి ప్రాధాన్యత ఇవ్వాలనే అంశంపై చర్చించారు. తొలుత మెజార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయం, సీఎం, డిప్యూటీ సీఎం, కీలక పదవులు ఆశిస్తోన్న సీనియర్ల అభిప్రాయాలను డీకే శివకుమార్ వివరించారు. మెజార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయం, పార్టీ శ్రేణుల నుంచి వస్తోన్న అభిప్రాయాల మేరకు రేవంత్ రెడ్డినే సీఎల్పీ నేతగా ఎంపిక చేశారు. ఈ విషయాన్ని సీఎం పదవి ఆశిస్తోన్న పార్టీ ముఖ్య నేతలకు వివరించి, బుజ్జగించే బాధ్యతను కేసీ వేణుగోపాల్‌కు అధిష్టానం అప్పగించింది.

మంత్రులువీరేనా?

సీనియర్ నేత మల్లు భట్టి విక్రమార్క, ములుగు ఎమ్మెల్యే సీతక్కకు ఉప ముఖ్యమంత్రులుగా ప్రకటించే అవకాశం ఉంది. మంత్రులుగా తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, షబ్బీర్‌అలీ, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, వివేక్, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, పద్మావతి, ఫిరోజ్‌ఖాన్, అంజన్‌కుమార్‌యాదవ్, మైనంపల్లి హన్మంతరావు, సుదర్శన్ రెడ్డి, వంశీకృష్ణ తదితరులకు అవకాశమివ్వనకున్నట్టు తెలిసింది.

అంతవరకే నా బాధ్యత : డీకే శివ కుమార్

సీఎల్పీ నిర్ణయాన్ని అధిష్టానానికి చెప్పడం వరకే తన బాధ్యత అని డీకే శివకుమార్ అన్నారు. ఎమ్మెల్యేలు ఇచ్చిన ఏక వాక్య తీర్మానాన్ని పార్టీ అధిష్టానానికి అందించేందుకు తాను ఢిల్లీకి వచ్చినట్టు తెలిపారు. అంత వరకే తాను చేస్తున్నట్టు స్పష్టత ఇచ్చారు. అయితే పార్టీ చీఫ్ నిర్ణయం శిరోధార్యమంటూ సీఎల్పీ తీర్మానం చేసిందని వెల్లడించారు. ఏఐసీసీ చీఫ్ మాత్రమే తెలంగాణ సీఎం, ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటారని వివరించారు. అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి ఉంటా: ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని ఉత్తమ్ తెలిపారు. ముఖ్య నేతలతో భేటీ అనంతరం ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఫలితాలు వచ్చి 48 గంటలు కూడా కాలేదన్నారు. కానీ అంతలోనే సీఎం విషయంలో ఆలస్యమవుతుందని సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సరికాదన్నారు. సరైన పద్ధతిలో సీఎం ఎన్నిక ఉంటుందని వివరించారు. తాను వరుసగా ఏడుసార్లు కాంగ్రెస్ టికెట్‌పై గెలిచానన్నారు. ఇన్ని సార్లు గెలిచిన ఎమ్మెల్యేగా తాను ఒక్కడిని మాత్రమే ప్రస్తుతం ఉన్నట్టు చెప్పారు.

తాను ఏ నాడు పార్టీ మారలేదన్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని తన పేరును కూడా సీఎం రేసులో తీసుకుంటారని ఆశించానన్నారు. కాగా ఎంపీ పదవికి రాజీనామా చేసేందుకు ఢిల్లీ వచ్చానని ఆయన వివరించారు. ఆ ప్రక్రియ ఏంటనే అంశాన్ని లోక్‌సభ స్పీకర్ ఆఫీసు నుంచి అడిగి తెలుసుకున్నట్టు చెప్పారు.




పాలమూరు నుంచి సీఎంగా%ొూ%రేవంత్ ప్రస్తానం

టీపీసీసీ అధ్యక్షులు,ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్తానం ఒడిదు డుకులతో ప్రారంభమైంది. నల్లమల నుంచి వచ్చిన ఆయన%ొూ%ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం వెనుక అనేక మలుపులున్నాయి. సొంత పార్టీనే ధిక్కరించి జిల్లాపరిషత్ ఎన్నికల్లో గెలుపొందడం మొదలు.. ప్రత్యేక తెలంగాణలో తొలిసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం వరకు ఆయన తన రాజకీయ జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నారు. వివాదాలు, ఓటములు, అవినీతి ఆరోపణలు, స్వపక్షం నుంచే విమర్శలు ఎదురైనా..మాస్ ఫాలోయింగ్‌తో వాట న్నింటినీ ఎదుర్కొంటూనే తనదైన దూకుడుతో దూసుకెళ్లారు. జనాకర్షక నేతగా ఎదిగారు. ఎట్టకేలకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అందించారు.

**ఒకే ఒక్కడుగా ఎన్నికల ప్రచారం**

కాంగ్రెస్ అధిష్ఠానం 2021 జూన్‌లో రేవంత్‌ను పూర్తిస్థాయిలో టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. ఇదే రేవంత్ రెడ్డి రాజకీయ జీవితాన్ని మరోమెట్టు పైకెక్కించింది. ఈ క్రమంలో ఆయనకు సొంత పార్టీలోనే విమర్శలు, ఎదురయ్యాయి. పలువురు కీలక నేతల నుంచి సహాయ నిరాకరణను ఎదుర్కొన్నారు.

ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీని తానే ముందుండి నడిపించారు. ప్రచారంలో తనదైన శైలితో అధికార పక్షంపై విరుచుకుపడుతూ యువతతోపాటు అన్నివర్గాల ఓటర్లను ఆకర్షించారు. అటు కొడంగల్‌తో పాటు కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌పై పోటీకి దిగారు. తన పాత స్థానం నుంచే మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన ఇప్పుడు సీఎం అయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి ఓడిపోయినా.. మరుసటి ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలిచారు. ఓ పక్క ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే.. మరోవైపు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఆయన దృష్టిపెట్టారు.

**ఇదీ రేవంత్ ప్రస్థానం**

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని కొండారెడ్డిపల్లిలో 1969 జనవరి 8న రేవంత్‌రెడ్డి జన్మించారు. తండ్రి అనుముల నర్సింహరెడ్డి, తల్లి రామచంద్రమ్మ. ఆయా భార్యగీత గృహిణి. రేవంత్‌కు ఒకేఒక్క కూతురు .ఆయన ఏవీ కళాశాల నుంచి బీఏ పూర్తి చేశారు. విద్యార్థి దశలో ఏబీవీపీలో చురుగ్గా వ్యవహరించారు.

- 2006లో మిడ్జిల్ మండలం జడ్పీటీసి సభ్యుడుగా విజయం
- 2007లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గా స్వతంత్ర్య ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీగా ఎన్నిక
- 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం నుండి కొడంగల్ ఎమ్మెల్యేగా గెలుపు
- 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్
- 2014-17 మధ్య కార్యనిర్వాహక అధ్యక్షులు
- 2017 అక్టోబరులో టీడీపీకి రాజీనామా
- 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిక

-- 2018లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు

- 2018 డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసి ఓటమి 2019 మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున మల్కాజిగిరి నుంచి ఎంపీగా పోటీ, విజయం
- 2021 జూన్ 26న పీసీసీ అధ్యక్ష్యులుగా నియామకం
- 2021 జూలై 7న టీపీసీపీ అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం
- 2023 డిసెంబర్ 5న సీఎంగా ఎన్నిక,


**డిసెంబర్**

**7న ముఖ్యమంత్రిగా ప్రమాణం .**

**శాంతించిన ఉత్తమ్, భట్టి**

ముఖ్యమంత్రి పదవి రేసులో తాము ఉన్నామంటూ ఢిల్లీకి వెళ్లిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్కను అధిష్టానం బుజ్జగించింది. ఖర్గేతో భేటీ అనంతరం వారు శాంతించారు. మంగళవారం కేసీ వేణుగోపాల్ నివాసంలో ముఖ్య నేతలు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. పార్టీ హైకమాండ్ తీసుకున్న నిర్ణయాన్ని సీనియర్ నేతలిద్దరికి కేసీ.వేణుగోపాల్ వివరించారు.

ఈ భేటీ అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా అధిష్టానం ఎవరి పేరు ప్రకటించిన తనకు ఆమోదమేనని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేగా గెలిచినందున ఎంపీ పదవికి రాజీనామా చేయాల్సిందేననీ, దీని త్వరలో నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు.



## చంద్ర కక్ష్య నుంచి భూకక్ష్యలోకి

# ప్రొపల్షన్ మాడ్యూల్ : ఇస్రో

(మొదటి పేజీ తరువాయి)

కక్ష్యకు ల్యాండర్ మాడ్యూల్‌ను మార్చడం మరియు ఉద్దేశించిన విధంగా విభజనను విజయవంతంగా సాధించడం ద్వారా ప్రొపల్షన్ మాడ్యూల్ (పిఎం) ప్రధాన లక్ష్యం నెరవేరిందని ఇస్రో వెల్లడించింది. విభజన తరువాత ఇస్రో పిఎం లోపల హాబిటబుల్ ప్లానెట్ ఎర్త్ (ఎస్‌హెచ్‌ఎపిఇ) పెలోడ్ స్పెక్ట్రోపోలారిమెట్రీని నిర్వహించిందని ప్రకటించింది. వాస్తవానికి ఎంపి మిషన్‌ను మూడు నెలల ఆపరేషన్ కోసం నిర్ణయించారు. ఒక నెల కంటే ఎక్కువ సమయం మాత్రమే పనిచేయడంతో 100 కిలోల ఇంధనం మిగిలిపోయిందని తెలిపింది. మిగులు ఇంధనాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో చంద్రయాన్ మిషన్‌ల కోసం అదనపు డేటాను సేకరించేందుకు మరియు భవిష్యత్ నమూనా రిటర్న్ మిషన్‌ల కార్యాచరణను రూపొందించేందుకు దీనిని వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు ఇస్రో ప్రకటించింది, . ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 లోని విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా చంద్రుడి దక్షిణ ధృవంపై ల్యాండ్ అయిన సంగతి తెలిసిందే.

# కోట్ల విలువైన ఎనిమి ప్రాపర్టీ షేర్లను అమ్మేశాం

(మొదటి పేజీ తరువాయి)

**మంత్రి అజయ్ కుమార్ మిశ్రా ఇవాళ లోక్‌సభలో ప్రకటన చేశారు. ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ఆ ప్రాపర్టీకి చెందిన షేర్లను అమ్మేసినట్లు మంత్రి వెల్లడించారు. యూపీలోని 19 ఎనిమి ప్రాపర్టీలను అమ్మేశామని, వాటి షేర్ విలువ 2709 కోట్లు ఉన్నట్లు చెప్పారు. ప్రాపర్టీ అమ్మకం ద్వారా వచ్చిన మొత్తాన్ని భారతీయ ఖాజానాలోకి జమ చేస్తారన్నారు. జిల్లా మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ వాల్యువేషన్ జరుగుతుందన్నారు. దేశంలో సుమారు 12,611 ఎనిమి ప్రాపర్టీలు ఉన్నాయని, వాటి విలువ కనీసం లక్ష కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.**

## కోట్ల విలువైన ఎనిమి ప్రాపర్టీ షేర్లను అమ్మేశాం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి అజయ్ కుమార్ మిశ్రా ఇవాళ లోక్‌సభలో ప్రకటన చేశారు. ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ఆ ప్రాపర్టీకి చెందిన షేర్లను అమ్మేసినట్లు మంత్రి వెల్లడించారు. యూపీలోని 19 ఎనిమి ప్రాపర్టీలను అమ్మేశామని, వాటి షేర్ విలువ 2709 కోట్లు ఉన్నట్లు చెప్పారు. ప్రాపర్టీ అమ్మకం ద్వారా వచ్చిన మొత్తాన్ని భారతీయ ఖాజానాలోకి జమ చేస్తారన్నారు. జిల్లా మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ వాల్యువేషన్ జరుగుతుందన్నారు. దేశంలో సుమారు 12,611 ఎనిమి ప్రాపర్టీలు ఉన్నాయని, వాటి విలువ కనీసం లక్ష కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ 64 సీట్లు గెలుచుకుంది. నిన్న కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశం జరిగిన విషయం తెలిసిందే. హైదరాబాద్? గచ్చిబౌలిలోని ఎల్లా హెూటల్‌లో ఆ పార్టీ ఎమ్మెల్యేలతో ఏఐసీసీ పరిశీలకులు సమావేశమై సీఎల్పీ నేత ఎంపికపై చర్చించారు. ఈ భేటీలో సీఎల్పీ నేత ఎంపికకు ఎమ్మెల్యేల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మల్లికార్జున ఖర్గే తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఇవాళ థాక్రె, డీకే శివకుమార్ లు భట్టి, ఉత్తమ్ లతో భేటీ అయ్యారు. అదేవిధంగా ఖర్గే నివాసంలో రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తెలంగాణ సీఎం అభ్యర్థి పై చర్చలు జరిపారు. ఇవాళ సాయంత్రం వరకు ప్రకటిస్తామని మల్లికార్జున ఖర్గే చెప్పినప్పటికీ సాయంత్రం అయినప్పటికీ ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. తాజాగా కేసీ వేణుగోపాల్ ఇంట్లో చర్చలకు భట్టి, ఉత్తమ్ లు హాజరై చర్చలు జరిపారు. ఈ చర్చలకు థాక్రె, డీ.కే.శివకుమార్ కూడా హాజరయ్యారు. ఈ చర్చల్లో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపిక, క్యాబినెట్ కూర్పు వంటి అంశాలపై చర్చించారు. మరోవైపు అధిష్టానం పిలుపు మేరకు ఢిల్లీకి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వెళ్లారు. మరి కొద్ది సేపట్లోనే కేసీ వేణుగోపాల్ ప్రెస్ మీట్ పెట్టనున్నట్టు తెలుస్తోంది.

## ముఖ్యమంత్రి ప్రకటన తర్వాత రేవంత్ తొలి ట్వీట్

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాక రేవంత్ రెడ్డి తొలిసారి ట్విట్టర్ వేదికగా స్పందించారు. తనను సీఎంగా ఎన్నుకున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు, సోనియా గాంధీకి, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్, మాణిక్ రావు థాక్రేకు హృదయపూర్వక కృతజ్ఞతలు చెప్పారు. కాగా, ఇటీవల వెలువడిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మెజార్టీ ఇచ్చారు. మ్యాజిక్ ఫిగర్‌కు మించి స్థానాలు కట్టబెట్టారు. అనంతరం సుదీర్ఘంగా చర్చలు జరిపిన కాంగ్రెస్ హైకమాండ్ సీఎల్పీ నేతగా రేవంత్ రెడ్డిని ప్రకటించింది. ఈ నెల 7వ తేదీన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## మిజోరం ముఖ్యమంత్రిగా ఈనెల 8న లాల్దుహెూమా ప్రమాణం



**ఐజ్వాల్ -ప్రభాతసూర్యుడు:** మిజోరం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పిఎం ) అధ్యక్షుడు లాల్దుహెూమా మిజోరం ముఖ్యమంత్రిగా ఈనెల 8న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణస్వీకారం అనంతరం రానున్న 100 రోజులకు సంబంధించి ప్రాధాన్య ప్రాజెక్టులను ప్రకటిస్తామని లాల్దుహెూమా తెలిపారు. ఈ రోజు సాయంత్రం 8 గంటలకు గెలుపొందిన ఎమ్మెల్యేలతో తమ నివాసంలో సమావేశం కానున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఆర్థికపరిస్థితి చాలా దారుణంగా ఉందని అన్నారు. ఎంఎన్ఎఫ్ నుండి అధికారాన్ని స్వీకరించినప్పటికీ.. తమ నిబద్ధతను చూపుతామని చెప్పారు. తమది రైతు ప్రభుత్వమని, వారికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. కనీస మద్దతు ధర ప్రకటించామని చెప్పారు. ఎంపిక చేసిన నాలుగు వస్తువులైన అల్లం, పసుపు, మిర్చి, చీపురు కర్రలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని ప్రకటించారు. కొన్ని అడ్డంకులు ఉన్నప్పటికీ.. ప్రజలకే ప్రాధాన్యత ఇస్తామని అన్నారు.

ఆర్థిక పునరుద్ధరణ కోసం నిపుణులతో వనరుల సమీకరణ కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కమిటీ పొదుపు చర్యలు, పెట్టుబడి చర్యలు, మానవ వనరుల అంచనా తదితర అంశాలను పర్యవేక్షిసుందని అన్నారు. ఆ తర్వాత, అవినీతి నిరోధక చర్యలకు ప్రధాన ప్రాధాన్యతనిస్తామని ప్రకటించారు. అవినీతిని పారద్రోలడంతో కొత్త ప్రభుత్వాన్ని ప్రారంభిస్తామని అన్నారు.

ఇటీవల జరిగిన మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో 40 స్థానాలకు గానూ జెడ్‌పిఎం 27 నియోజకవర్గాల్లో గెలుపొంది, సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది. జెడ్‌పిఎం ముఖ్యమంత్రి అభ్యర్థి లాల్దుహెూమా, సెర్చిప్ నియోజకవర్గంలో మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్)కి చెందిన జె. వచాంగ్‌పై 8,314 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

## ఆపదలో ఉన్న జర్నలిస్టు కుటుంబాన్నికి పగడాల కనకయ్య ఫౌండేషన్ 10వేల ఆర్థిక సహాయం

### ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తు

**ఇబ్రహీం పట్నం: - ప్రభాత సూర్యుడు :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన అంజి ఐ న్యూస్ రిపోర్టర్ గా పనిచేస్తున్నాడు. ఈ మధ్యకాలంలో గుండెపోటు రావడంతో హైదరాబాదులోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 4వ తేదీన సర్జరీ చేసిన డాక్టర్లు గుండెకు ఒక స్టంట్ అమర్చారు. పరిస్థితి బాగ లేకపోవడంతో మరో స్టంట్ అమర్చాలని డాక్టర్లు చెప్పారు. అంజి కుటుంబం ఆర్థికంగా వెనుకబడినవారు. ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్నారు. సహచరుల ద్వారా సమాచారం అందుకున్న పగడాల మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తు జర్నలిస్టు కుటుంబానికి తన వంతు 10వేల రూపాయలు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేసి అంజి ఆరోగ్యం మెరుగుపడాలని ముత్తు కోరుకున్నారు. ఏ ఆపద వచ్చిన ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటామని అన్నారు. జర్నలిస్ట్



కుటుంబానికి అండగా నిలిచిన ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తుకు అంజి కుటుంబ సభ్యులు కృతజ్ఞత తెలియజేశారు. పగడాల ముత్తు మరెన్నో సేవలు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## పోలీసు శాఖలో భారీ మార్పులు?

### కొత్త సీఎం రాగానే చర్యలు షురూ

**హైదరాబాద్-ప్రభాతసూర్యుడు:**

రాష్ట్ర పోలీసు శాఖలో భారీ ఎత్తున మార్పులు జరగనున్నాయా? పలు కీలక పోస్టులలో కొత్త మొఖాలు రానున్నాయా? మార్పులు చేస్తే ఎవరికి ఎక్కడ పోస్టింగ్ లభిస్తుంది? అనే ఊహాగానాలు ఐపీఎస్ అధికార వర్గాల్లో జోరందుకున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలను చేపడుతుండటంతో కొత్త ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసు శాఖలో పలు మార్పులు చేస్తూ ప్రక్షాళన చేసే అవకాశమున్నదని ఐపీఎస్ వర్గాలు భావిస్తున్నాయి. సాధారణంగా రాష్ట్రంలో కొత్త ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టినప్పుడల్లా శాంతి భద్రతలను పర్యవేక్షించే అత్యంత కీలకమైన డీజీపీ పోస్టులో తనకు అనుకూలమైన సీనియర్ ఐపీఎస్ అధికారిని నియమించుకోవటం జరుగుతున్నది. తాజాగా, రేవంత్ రాష్ట్ర ప్రభుత్వ సారథ్యాన్ని స్వీకరించనుండటంతో కీలకమైన పోలీసు శాఖలో సైతం మార్పులకు శ్రీకారం చుడతారని భావిస్తున్నారు. ముఖ్యంగా, రాష్ట్ర డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్, నగర పోలీసు కమిషనర్‌తో పాటు మరికొద్ది కీలకమైన పోస్టులలో ప్రస్తుతమున్న అధికారులను మార్చే అవకాశమున్నదని ఐపీఎస్ వర్గాలు ఊహిస్తున్నాయి. రెండ్రోజుల క్రితమే రాష్ట్ర కొత్త డీజీపీగా ఏసీబీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవి గుప్తాను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి నియమించిన విషయం




తెలిసిందే. అయితే, ఈయనను అప్పటి వరకు డీజీపీగా ఉన్న అంజనీకుమార్‌ను ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేయటంతో నియమించాల్సి వచ్చింది. కాగా, ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకోకముందు అంజనీకుమార్‌నే వచ్చే కొత్త ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేక మారుస్తుందా? అనే అనుమానాలు అప్పుడే వ్యక్తమయ్యాయి. రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక రవి గుప్తాను డీజీపీగా కొనసాగిస్తారా? లేక తన ఛాయిస్‌తో మరో సీనియర్ ఐపీఎస్ అధికారిని నియమిస్తారా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కొత్త ముఖ్యమంత్రితో పాటు ఆయన మంత్రి వర్గంలో చేరే క్యాబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేల సూచనల మేరకు కూడా రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగే అవకాశాలున్నాయని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల పనితీరును పరిశీలించిన కొందరు మాజీ ఐపీఎస్ అధికారులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## నా అన్న రేవంత్ కి అభినందలు : సీతక్క

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 64 సీట్లను సాధించి ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధం అయింది. అయితే గత రెండు రోజుల నుంచి తెలంగాణ సీఎల్పీ నేత ఎవరు అనే ఉత్కంఠ నెలకొంది. మరోవైపు మాజీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క ఇవాళ ఉదయం ఢిల్లీకి వెళ్లారు. ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే, థాక్రె, డీ.కే.శివకుమార్, కేసీ వేణుగోపాల్ వంటి అధినాయకులను కలిసారు. పలు విషయాల గురించి చర్చించారు. చివరగా కేసీ వేణుగోపాల్ ప్రెస్ మీట్ పెట్టి రేవంత్ రెడ్డినే తెలంగాణ ముఖ్యమంత్రి అని ప్రకటించారు. ఎప్పుడైతే కేసీ వేణుగోపాల్ తెలంగాణ ముఖ్యమంత్రిని ప్రకటించారో అప్పటి నుంచే పలువురు సోషల్ మీడియాలో రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్నారు. రేవంత్ రెడ్డి ప్రస్తావన తొలి నుంచి సీఎంగా ఎదిగిన తీరును గుర్తు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ములుగు ఎమ్మెల్యే సీతక్క హర్షం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. నా అన్నకు అభినందను.. మీరు కచ్చితంగా దేశంలోని పవర్ ఫుల్ సీఎంలలో ఒకరిగా మారుతారని పేర్కొన్నారు. ఫ్యామిలీతో కలిసి రేవంత్ తో ఉన్న ఫోటోలను షేర్ చేసింది సీతక్క.



### నా శ్రేయస్సు కోరుకునే రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు: బండ్ల గణేశ్ ట్వీట్

తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న రేవంత్ రెడ్డికి సినీ నిర్మాత బండ్ల గణేశ్ శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. 'తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమితులైన మా నాయకుడు, నిరంతరం నా శ్రేయస్సును కోరుకునే మా అన్న ఎనుముల రేవంత్ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు' అంటూ ట్వీట్ చేశారు. 'నాడు బూర్గుల (1952), నేడు ఎనుముల( 2023)పాలమూరు నుండి ముఖ్యమంత్రులు' అంటూ మరో ట్వీట్ చేశారు.

రేవంత్ రెడ్డికి సిద్ధరామయ్య శుభాకాంక్షలు.. బండ్ల గణేశ్ రీట్వీట్

కాంగ్రెస్ శాసన సభా పక్ష సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రేవంత్ రెడ్డి పాలనలో అందరినీ కలుపుకొని పోయి, ప్రగతిశీల, పారదర్శక పాలన అందిస్తారని నాకు నమ్మకం ఉందంటూ సిద్ధరామయ్య ట్వీట్ చేశారు. దీనిని బండ్ల గణేశ్ రీట్వీట్ చేశారు.

### రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బాలకృష్ణ



తెలంగాణ నూతన ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో, రేవంత్ రెడ్డిపై అభినందనల జడివాన కురుస్తోంది. తాజాగా, ఏపీ టీడీపీ ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ స్పందించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎంపికైన ఎనుముల రేవంత్ రెడ్డి గారికి నా అభినందనలు అంటూ బాలకృష్ణ ఓ ప్రకటన విడుదల చేశారు. "తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రెండో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న ఎనుముల రేవంత్ రెడ్డి గారికి శుభాకాంక్షలు. ప్రజా సేవ పరమావధిగా రాజకీయాల్లో అంచెలంచెలుగా రేవంత్ రెడ్డి ఎదిగారు. తెలంగాణ ప్రజలు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి ఆకాంక్షను నెరవేర్చాలని, అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పోవాలని ఆశిస్తున్నాను. ముఖ్యమంత్రిగా మీ మార్కు పాలనతో తెలంగాణ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నాను" అంటూ బాలకృష్ణ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# పార్లమెంటు ఎన్నికలే లక్ష్యం..

**- రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు**
**- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం**



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిన నేపథ్యంలో ఈ వైఫల్యం నుంచి బయటపడి పార్లమెంటు ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. కచ్చితంగా 10 నుంచి 12 ఎంపీ సీట్లలో గెలవటం ద్వారా పార్టీకి పునర్ వైభవాన్ని తీసుకురావాలని ఆయన భావిస్తున్నారు. అందుకనుగుణంగా కార్యాచరణ రూపొందించా లంటూ జిల్లాల అధ్యక్షులు, ముఖ్య నేతలను ఆదేశించారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన ఆదివారం ఆయన హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ నుంచి ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లిపోయిన సంగతి విదితమే. ఈ క్రమంలో మాజీ సీఎంను కలిసేందుకు బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలుగా గెలిచిన నాయకులు అక్కడికి క్యూ కట్టారు. మంగళవారం వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఆలంపూర్ నుంచి గెలిచిన విజయుడు తదితరులు కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారితో ఆయన సుదీర్ఘ మంతనాలు, సమాలోచనలు జరిపారు. ముఖ్యంగా బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహణ, ఎల్పీ లీడర్ ఎన్నికపై ప్రధానంగా కేసీఆర్ చర్చించారు. ముందుగా అనుకున్నట్టు తనయుడు కేటీఆర్‌ను శాసనసభాపక్ష నాయకుడిగా నిర్ణయించాలని అనుకున్నప్పటికీ పార్లమెంటు ఎన్నికల వరకూ తానే ఆ పాత్రను పోషించాలని కేసీఆర్ భావిస్తున్నట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఎంపీ ఎలక్షన్ల వరకూ అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు తిరగాలనీ, తద్వారా పార్టీని బలోపేతం చేయాలని భావిస్తున్నారు. 'పదేండ్ల మన ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జనాలకు మరోసారి గుర్తు చేయాలె. ఓటేసిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలపాలె. అదే సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలుకు అందరమూ కలిసి పోరాడదామంటూ ప్రజలకు పిలుపునివ్వాలె అంటూ ఆయన నేతలకు చెప్పినట్టు తెలిసింది. తద్వారా పార్లమెంటు ఎన్నికల నాటికి పార్టీకి 'బూస్టప్' ఇద్దామంటూ దిశా నిర్దేశం చేశారు. ఎంపీ ఎలక్షన్లలో మెదక్ నుంచి పోటీ చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. అందువల్ల ఆ ఎన్నికల్లో ఇటు ఆంధ్రాతోపాటు అటు మహా రాష్ట్రలోనూ బీఆర్ఎస్ అభ్యర్థులను నిలబెట్టనున్నారు. తెలంగాణతోపాటు ఆయా రాష్ట్రాల్లో కొన్ని సీట్లను గెలిస్తే%ూ% ఢిల్లీలో చక్రం తిప్పొచ్చనే అంచనాతో కారు సారున్నారు. అందువల్ల పార్లమెంటు ఎన్నికల వరకూ ఇక్కడ శాసనసభాపక్ష నేతగా వ్యవహరించి, ఆ తర్వాత హస్తినలో 'రాజకీయం' చేయాలని ఆయన యోచిస్తున్నారు. ఇదే జరిగితే కేటీఆర్‌కు ఆర్నెల్ల తర్వాతే ఎల్పీ లీడర్ అయ్యే అవకాశముంటుంది. ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో ఎవరు పార్టీని అంటిపెట్టుకుని ఉంటారు..? ఎవరు పక్క చూపులు చూస్తారనే దాన్ని కేసీఆర్ సీరియస్‌గా తీసుకోవటం లేదని తెలిసింది. 'ఇవన్నీ పట్టించుకుంటే పార్టీని నడపలేం. ఉన్నోడు ఉంటడు.. పోయినోడు పోతడు. మనమైతే ఎక్కువ సంఖ్యలో ఎంపీ సీట్లను గెలవటం ద్వారా పార్టీ నాయకుల్లోనూ, కార్యకర్తల్లోనూ ఉత్సాహాన్ని నింపాలి అంటూ వ్యాఖ్యానించినట్టు సమాచారం.

## విజయ దుందుభి మోగించిన మహిళలకు శుభాకాంక్షలు

**- డా.హిప్నో పద్మా కమలాకర్, జి.కృష్ణవేణి, జ్యోతి రాజా**



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** ఎన్నికల్లో విజయ దుందుభి మోగించిన మహిళలకు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్, జి.కృష్ణవేణి, జ్యోతి రాజా, డా.స్వరూపారాణీ, యోగా గురు సరోజని రామారావు, డా.క్యార్లిన్ లయన్స్ క్లబ్, యోగా సాధకులు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీ ఎన్నికల కల్లా మహిళా రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూడాలని కోరారు. మహిళలు సమస్యలు వెంటనే పరిష్కరించేలా చూడాలని తెలిపారు. ఎన్నికల్లో విజయ దుందుభి మోగించిన సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, కొండా సురేఖ, యశస్విని రెడ్డి, లాస్య నందిత, పద్మావతి మొదలగు మహిళా మణులకు శుభాకాంక్షలు తెలిపారు.

# అసెంబ్లీలో కమ్యూనిస్టుల గొంతుక

**- మద్దతిచ్చిన సీపీఐ(ఎం), టీజేఎస్, ఎంఎల్ పార్టీలకు ధన్యవాదాలు**
**- కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**
**- మంత్రివర్గంలో చేరాలని కాంగ్రెస్ ప్రతిపాదిస్తే ఆలోచిస్తాం : నారాయణ**




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అసెంబ్లీలో కమ్యూనిస్టు పార్టీలన్నింటికీ తాను గొంతుకనవుతాననీ, ప్రజాసమస్యలను లేవనెత్తుతానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రభుత్వాల నిర్బంధం, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడతానని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వమే నిర్బంధాలు, అణచివేతలు, నిరంకుశత్వానికి వ్యతిరేకమని అన్నారు. నిజాం నవాబు క్రూర రాచరిక పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ రైతాంగ సాయుధ పోరాటాన్ని చేపట్టి తెలంగాణాను విముక్తి చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో నాటి పరంపర కొనసాగిందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు నిర్బంధం ఉన్నా స్వేచ్ఛ ఉండేదని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ఈ పదేండ్లలో స్వేచ్ఛ లేదన్నారు. బాధను కూడా వ్యక్తం చేయలేని పరిస్థితి ఉందనీ, ఊపిరి ఆడనివ్వకుండా నిర్బంధాలతో ఉండేదని అన్నారు. ఆందోళనకు దిగితే ముందస్తు అరెస్టులు జరిగేవనీ, బంగారు తెలంగాణ అంటూ బీఆర్ఎస్ ఇచ్చిన వాగ్దానాలు ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. అధికారం శాశ్వతమనుకుని నిర్బాంధాలకు పాల్పడితే ప్రజలు సహించబోరనీ, తిప్పికొడతారనే విషయాన్ని ఈ ఎన్నికల్లో నిరూపించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసించారని చెప్పారు. ఎన్నికల పొత్తు అంశంలో తమ పట్ల సీపీఐ(ఎం) హుందాగా వ్యవహారించిందనీ, ఆ పార్టీ నాయకులు తమ విజయానికి బాగా కష్టపడ్డారని కూనంనేని అన్నారు. సీపీఐ(ఎం) పోటీచేసిన 19 స్థానాలతోపాటు కొత్తగూడెంలో సీపీఐ విజయం కోసం కృషి చేశారని వివరించారు. కొత్తగూడెం ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించినందుకు అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. తన విజయానికి కృషి చేసిన కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ (ఎంఎల్), టీడీపీ, టీజేఎస్, వైఎస్ఆర్‌టీపీ, ప్రగతిశీల శక్తులకు, ఓటర్లకు కృతజతలు చెప్పారు. తనను పోటీ చేసే అవకాశం కల్పించిన తమ పార్టీ జాతీయ, రాష్ట్ర పార్టీకి ధన్యవాదాలు ప్రకటించారు.

### పర్యాటక భవనం అగ్నిప్రమాదంపై న్యాయవిచారణ జరపాలి : నారాయణ

మంత్రివర్గంలో చేరాలని కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదిస్తే ఆలోచన చేసి పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. పర్యాటక శాఖ పరిపాలన భవనం అగ్నిప్రమాదంపైన న్యాయవిచారణ జరపాలనీ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో వందల కోట్ల రూపాయల దుర్వినియోగం బయటపడుతుందని భావించి విలువైన దస్త్రాలను పర్యాటక శాఖ ఎండీ, మంత్రి తగుబెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అందరినీ కలుపుకుని, విశాల దృక్పథంతో ముందుకెళ్తే, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్ వంటి వాతావరణం ఉండబోదని స్పష్టం చేశారు. ఇండియా కూటమి బలపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటినర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# పాగాలకు కన్నీటి వీడ్కోలు

**- అశ్రునయనాలతో జెడ్పీ చైర్మెన్ సంపత్ రెడ్డి అంత్యక్రియలు**
**- పరామర్శించిన కేటీఆర్, పలువురి నివాళి**



స్టేషన్‌ఘనపూర్- ప్రభాత సూర్యుడు

గుండెపోటుతో అకస్మాత్తుగా మృతిచెందిన బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు, జెడ్పీ చైర్మెన్ పాగాల సంపత్ రెడ్డికి మంగళవారం అభిమానులు, పార్టీలకతీతంగా నాయకులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలి రావ డంతో రాజవరం జనసంద్రమైంది. సంపత్ రెడ్డి సోమవారం గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఆస్పత్రి నుంచి తన భౌతిక కాయాన్ని స్వగ్రామమైన చిల్పూరు మండలం రాజ వరంకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వ హించారు. సంపత్ అంత్యక్రియలకు మాజీ మంత్రి కేటీఆర్ హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2001 నుంచి రెండు దశాబ్దాల పాటు మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. జిల్లా అధ్యక్షునిగా, జెడ్పీ చైర్మెన్‌గా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆత్మీయ సోదరుడు సంపత్ రెడ్డిని కోల్పోవడం బాధగా ఉందని, పార్టీకి తీరలోటని అన్నారు. వారి కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, బండా ప్రకాష్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, సాంబారి సమ్మారావు, జెడ్పీ చైర్మెన్ సుధీర్ బాబు, టీపీసీసీ ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర, అంగోతు బిందు, సతీష్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎడవెళ్లి కృష్ణా రెడ్డి, జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మెన్ మారపాక రవి పాల్గొని పూల మాలలు వేసి నివాళ్లర్పించారు.

# రోడ్డు ప్రమాద ఘటనపై హైకోర్టు తీర్పు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ నిర్లక్ష్యం ఉందని చెప్పి అతని పక్క సీటులో ఉన్న వ్యక్తి మరణిస్తే బీమా పరిహారం తగ్గించడం చెల్లదని హైకోర్టు తీర్పు చెప్పింది. మృతుడి కుటుంబానికి పరిహారం రూ.29 లక్షల్లో సగమే చెల్లించాలని మోటారు ప్రమాదాల వివాదాల పరిష్కార ట్రైబ్యునల్ ఆదేశాలు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను మృతుడి భార్య మరొకరు వేసిన పిటిషన్లను మంగళవారం జస్టిస్ పి శ్యాంకోశీ, జస్టిస్ ఎన్ తుకారాంజీలతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. మొత్తం పరిహారానికి 2013 నుంచి వడ్డీతో సహా చెల్లించాలని న్యూఇండియా బీమా కంపెనీని ఆదేశించింది. 2013లో మచిలీపట్నం నుంచి హైదరాబాద్ వస్తుండగా రోడ్డు పక్కన వాహనాన్ని ఢకొనెడంతో డ్రైవర్ పక్క సీటులోని ప్రయాణీకుడు సుబ్బారావు అనే వ్యక్తి మరణించారు.

అతని కుటుంబానికి రూ.29 లక్షలు బీమా చెల్లించాలనే నిర్ణయంపై ట్రైబ్యునల్, ప్రమాదానికి ఇరుపక్షాల నిర్లక్ష్యం ఉందని చెప్పి ఆ మొత్తాన్ని సగానికి తగ్గించింది. ఈ ఉత్తర్వులను మృతుడు సుబ్బారావు భార్య మెదక్‌కు చెందిన ఎ సత్యవతి మరొకరు హైకోర్టులో సవాల్ చేశారు. రోడ్డు పక్కన ఆగి ఉన్న వాహనాన్ని కారు ఢకొరెదనీ, ఈ ప్రమాదానికి డ్రైవర్ పక్క సీటులో ఉన్న వ్యక్తి బాధ్యత ఎలా వహిస్తారని ప్రశ్నించిన హైకోర్టు పై విధంగా బీమా కంపెనీకి ఆదేశాలు ఇచ్చింది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215